# సమాజం

శ్రీ నండూరి ఈశ్వరం

కృష్ణవేణీ నది మెలికలు తిరిగిన నల్లత్రాచులా ప్రవహిస్తోంది. గాలికి వూగిన మావిగుబురుల నీడలు చీకటికి నలుపుదిద్దుతున్నాయి. పడమటిమబ్బుల చాటున చంద్రకాంతి అస్పష్టంగా కనుపిస్తోంది. రివ్వ గాలి యిసుక పొరలను రేపుతూంది. తీరం వెంటనే కెరటాల మ్రోత వింటూ నడుస్తున్నాను.

ఎంత ప్రొద్దుపోయిందీ నాకు తెలియదు. అయిదు సంవత్సరాల నిర్బంధ కారాగారవాసంలోనుంచి యీ సాయంతనమే నాకు విముక్తి కలిగింది. ఇంత కాలమూ ప్రకృతి నాకు దూరమైపోయింది. నాలోని ప్రతి యణువూ స్తంభీభూతమై పోయింది. ఇనుప కటకటాల లోపల నిస్తేజమై నీరసమైపోయిన నాశరీరం నదీమారుతంలో ఉత్తేజిత మవుతూంది. అంతుమాలిన పరిశ్రమతో నిర్జీవమై వల్లబడిపోయిన నాప్రతి రక్తబిందువూ ఏదో నూతనోత్సాహాన్ని ఆశను పుట్టిస్తోంది. బానిసతనంలో నిద్రాణమయిపోయిన వూహా సంతతికి చైతన్యం కలుగుతోంది. ఇప్పుడు......అయిదు సంవత్సరాలకు...... స్వేచ్ఛావాయువు పీలుస్తున్నాను. కృష్ణవేణీ; యిసుక తిన్నెలూ; చెట్టుపుట్టలూ; మబ్బులూ; గాలీ; యివన్నీ ప్రేమాస్పదము లవుతున్నాయి. ఏదో అవ్యక్తానందాన్ని అనుభవించ గలుగుతున్నాను.

నాకీ ప్రపంచంలో యెవరూలేరు. నాకు నేనే. తల్లిదండ్రులు లేని ఒక అభాగినిని......బాల వితంతువును.........వివాహం చేసుకున్నందుకు సమాజం నాపై కత్తిగట్టింది. నన్నేవిధంగానైనా నాశనంచేయాలని ప్రయత్నించింది. అందువలన మాకనేక కష్టాలు కలిగినాయి. నేను దొంగతనం చేశాననే నేరం మోపారు. తెల్లవారేసరికి మాయింట్లో ఒక వెండి కంచమూ రెండు వెండి గిన్నెలూ పడివున్నాయి. గ్రామంలో నలుగురికీ యీవిషయం చెబుదామని నేను బయలుదేరేలోపలనే పోలీసు జవానులతో సభాపతి పేరయ్యశాస్త్రి వచ్చాడు. పోలీసులు నన్ను పట్టుకున్నారు. కేసు విచారణకు వచ్చేసరికి నా తరఫున సాక్ష్యంలేకపోయింది. ఫిర్యాది పేరయ్య శాస్త్రికి బలమైన సాక్ష్యం వున్నది. నేరం స్థిరపడింది. అయిదు సంవత్సరాల కఠినశిక్ష విధింపబడింది. నాభార్య యేడుస్తూ జయిలువద్దకు వచ్చింది.

“నన్నుకూడా జయిలులో పెట్టమంటే ఒప్పుకుంటారేమో!” అన్నది. అంత విచారంలోనూ నవ్వు వచ్చింది నాకు.

“పిచ్చిదానా! అలా ఒప్పుకోరు. ధైర్యంగా ఈ అయిదు సంవత్సరాలూ గడుపు. భగవంతుడే వుంటే యీ నీలాపనిందలోనుంచి అచిరకాలంలో విముక్తుడ నవుతాను: వెళ్లు యమునా! విచారించకు. ఇది యీశ్వరేచ్ఛ” అన్నాను. నాకంఠం రుద్ధమైపోయింది. నా వంక సాశ్రులోచనాలతో నిశ్చలంగా చూచింది యమున. మోకరిల్లి నమస్కరించింది. కటకటాల్లోనుంచే చేయెత్తి దీవించాను. అలానే లేచి తలవంచుకొని మెల్లగా నాచూపు దాటిపోయింది. నాటి ఆ విషాదార్ద్రమూర్తి......నా యమున,......నా హృదయరాజ్ఞి...అదే ఆమెను కడసారి చూడటం! ఆమె వెళ్లిన వేపే చూస్తూ నిలుచున్నాను.

రెండు సంవత్సరాలు గడచిపోయినాయి. మా యూరి కాపు వెంకన్న వార్డరును మంచిచేసుకుని నన్ను చూడటానికి వచ్చాడు. ఏదో మహాఘోరవార్తను మోసుకొని వచ్చినట్లుతని ముఖమే చెబుతోంది. కాని...ఆ భయంకర వార్తతో...ఆదారుణ కశాఘాతంలో నాహృదయం...నారాతిగుండె......బ్రద్దలుకాలేదు. సమాజపు బాధలు పడలేక నా యమున......నాసర్వస్వం.........నా భాగ్యదేవత......కృష్ణవేణి మాత గర్భాన్ని ఆశ్రయించింది. ప్రమాదవశాత్తు కృష్ణవేణి లోపడి మరణించినట్లుగా పంచాయతీ చేశారు. కాని పవిత్రమైన ఆమె ఆత్మతోబాటు భౌతికశరీరం కూడా వారికి కనుపించలేదు. ఆమెను ప్రేమతో తన గంభీర గర్భంలో యిముడ్చుకొన్నది కృష్ణవేణి.

నిశ్శబ్దంగా విన్నాను. గుండెలో సముద్రాలు సుళ్లుతిరిగినాయి. ఏంచెయ్యగలను? నా దురదృష్టానికి యెవరిని నిందిస్తాను? ఏమి ప్రయోజనం? ఎవరికోసం

యే యాతతో నేను జీవించాలి? ఇంత కఠోరానుభూతిని భరిస్తూ బ్రతకటంకన్నా మరణించటం మంచిది కాదూ? మరణించి? ఆమెను మరోలోకంలో చూడగలనేమో! ఆ మరో ప్రపంచం అసలు వుందో లేదో! ఏమయినా చావే మేలు. జయిల్లో చావటానికైనా వీల్లేదే! అనుక్షణమూ కాపలా వుంటుందే!

గబ్బిలాలూ ఎర్రటోపీలూ చూస్తూ కాలంగడిపాను. శిక్షాకాలం పూర్తియై నేటికి విడుదల చేశారు. బాహ్యప్రపంచంలో కాలుపెట్టాను. ఆత్మహత్య చేసుకోవాలనిపించింది. తిన్నగా కృష్ణా తీరానికి వచ్చాను. చచ్చిపోయేముందు స్వేచ్ఛావాయువును అనుభవిద్దామనుకున్నాను. కృష్ణానది సహస్రబాహువులతో నా ప్రయత్నాన్ని వారిస్తోంది. నిరాశాతప్తమైన నాహృదయంలో ఒక్కమారుగా ఆశాజ్యోతి వెలిగింది. యమున బ్రతికియుండ గూడదూ? వెంకన్న అసత్యం చెప్పాడేమో! ఛా! అసంభవం! వెంకన్న చాలా నమ్మకమైనవాడు. కాని యమున కృష్ణలో పడితేమాత్రం బ్రతుకగూడదూ? పిచ్చి! ఇంకెక్కడి యమున!! తీరం వెంటనే కొన్నిమైళ్ళు నడిచాను. ఎక్కడికో! ఏమో!

దూరాన పల్లెగుడిసెలు కనుపిస్తున్నాయి. అటువయిపునుంచి ఒకవ్యక్తి వస్తోంది. సమీపించింది. ఆమె చీరకొంగు రెపరెపలాడుతోంది. నాకు పదిబారలముందు తీరంలో కూర్చుని కృష్ణవేణివంక నిశ్చలంగా చూస్తోంది. చంద్రకాంతి ఆమె ముఖంమీద పడుతోంది. జడలుగట్టిన కుంతలాలు పూర్వ భారత ఋష్యాశ్రమ కన్యలను జ్ఞప్తికి దెస్తున్నాయి. ఈనిర్జన ప్రదేశంలో హోరుగాలిలో నడిరాత్రిలో యిలావచ్చి కూర్చుందేమా అనుకున్నాను. మరింత ముందుకు వెళ్ళాను.

"ఎవరు?"అని ప్రశ్నించాను. ఉలికిపడి లేచింది.

"ఎవరు? ఎవరు? నా ఆరాధ్యదైవం!!!" అంటూ నా కాళ్లమీద పడింది. ఆశ్చర్యపడ్డాను. ఎవరీమె? పిచ్చిది కాదుగదా! లేవనెత్తిచూచాను. స్మృతిపథాంతరాంతాల్లో యేదో కుంకుమరేక అవ్యక్తంగా గోచరిస్తోంది. ఎవరు! య...ము...ఇంకెక్కడి యమున?!! కాదు. ఎవరో! ఆమె నాకళ్లల్లోకి చూస్తోంది. ఆకళ్ళు......చిరపరిచయములైన ఆ చక్కని తెల్లని కళ్లు......ఏదో జ్ఞప్తికితెస్తున్నాయి. కళ్ళు! యమున!! ఈమె నా య...ము...న కాదుగదా?

"యమునా!" నా పెదవుల్లోంచి అప్రయత్నంగా వెలువడింది. నా బాహువులు ముందుకు చూచుకున్నాయి. ఆమె వ్రాలిపోయింది. నాయమున!! ఈమె నా యమున!! మా కన్నీరు సికతాతలాన్ని తడిపివేసింది.

వేగుచుక్క పొడిచింది. దిశాంతాలు క్రమంగా తెల్లబడుతున్నాయి. ఉషోసుందరి చిరునవ్వుతోంది. నాతొడమీద తలనుంచి కాలితో యిసుకను రాస్తూ యమున చెబుతోంది.

"..........కృష్ణవేణిలో నా జీవితాన్ని అంతమొందించాలని ప్రయత్నించవలసి వచ్చింది. మిమ్మ


## ఉచిత కానుక పొందుడు!

అపూర్వ అవకాశం

పారిస్ బంగారం (రిజిస్టర్డ్) కొనండి. శాస్త్రీయంగా అసలు బంగారంగావుంటుంది. ఔన్సు (2½ తులాలు) 1 కి రూ 6, 2 ఔన్సులు 10 రూపాయలు ఒక పౌను (16 ఔన్సులు) 72 రూపాయలు చొప్పున అమ్మబడును. ఆభరణాలుకు, గడియారపు కేసస్‌కు, పెన్ నిబ్బులు వగైరా వాటికి బంగారంతో కలిపిగాని ప్రత్యేకంగాను చేయించుకోవచ్చును.

తృప్తికరంగా లేకపోతే డబ్బు వాపసు చేయబడును. ఇప్పుడే ఒకఔన్సు లేక రెండు ఔన్సులు పారిస్ గోల్డుకు ముందుగా పెద్ద ఆర్డరు యిచ్చేముందు యివ్వండి మీకే తెలుస్తుంది.

తక్షణమే ఆర్డరుయిచ్చి వుచిత కానుక పొందండి. ఇంగ్లీషులోకాని ఫ్రెంచిలోకాని వ్రాయండి.

స్థానిక ఏజంట్లు కావాలి.

*Sole-Distributors :*

**HOUSE OF COMMERCE,**

**4/1, Shilloing Road, GAUHATI.**

ల్ని తలుచుకుని విలపించాను. మీరు జెయిలునుంచి వస్తే నన్ను వెదుకుతారనీ విచారంతో కృంగిపోతారనీ మీకు నేను కనుపించకపోతే మీరు బాధపడతారనీ మీకు మహాద్రోహం చేస్తున్నాననీ చింతించాను. గత్యంతరంలేక పోయింది. ఆ పాపి.....ఆ పేరయ్యశాస్త్రి...మానవాధముడు...నన్ను మానభంగం చెయ్యాలని...ప్రయత్నించాడు. మిమ్మల్ని తలుచుకుంటూ నదీగర్భంలోనికి పరువెత్తుకు పోయాను.

స్మృతి వచ్చి కనులు తెరచి చూచేటప్పటికి ఒక పల్లె గుడిసెలో వున్నట్లు గ్రహించుకోగలిగాను. కృష్ణలో చేపలు పట్టుకునే పల్లెవాళ్ళు నన్ను వెలికి తీసారని తెలుసుకున్నాను. నాటినుంచీ నేటివరకూ అనుక్షణమూ మిమ్మల్ని స్మరిస్తూ మీ క్షేమంకొరకై సర్వశక్తిమయుని ప్రార్థిస్తూ కృష్ణవేణీ నీలజలాలను శూన్యంగా చూస్తూ ఒంటరిగా అహోరాత్రాలు ఈ యిసుకతిన్నెలమీదనే మీకోసం స్తబ్ధంగా దుఃఖిస్తూ కాలంగడుపుతున్నాను. ఏ పల్లె ఏ ప్రదేశంలో వున్నదీ నాకు తెలియదు. తెలుసుకోవలసిన అవసరం కలుగలేదుకూడాను. అమాయకులైన పల్లెవారి ఆదరణతో జీవించగలిగాను. నా ప్రార్థనలు ఫలించి.........మీరు.........నా కంటికి......"

యమున యేమేమో చెప్పబోతోంది. పాలిపోయిన ఆముఖాన్ని తెల్లని కన్నుల్ని ముద్దుపెట్టుకున్నాను. ఉదయారుణ రేఖలు మమ్మి దీవించినాయి.

"పోదామా యమునా!' అన్నాను.

"ఎక్కడికి?"

"ప్రపంచంలోకి"

"ఈ పల్లెలోనే మనమూ ఒక గుడిసె వేసుకుని కాపురముండ గూడదూ? ప్రపంచంలోని యీర్ష్యకు అసూయకు దూరంగా ఈ ప్రశాంత వాతావరణంలో జీవించగూడదూ?" యమున జాలిగా అడిగింది.

"అలానే" అన్నాను.

కృష్ణా తరంగ శకల బిందువులు స్నేహంతో మమ్మల్ని స్పృశించినాయి. ఇద్దరమూ లేచి ఆ పల్లె గుడిసెలవైపు నడిచిపోయాము.

*SALE!* *SALE!* *SALE*

**Reduced Sale Price Rs. 3-12-0**



జెంట్స్ లివర్ రిస్టువాచ్ నెం. 44

పూర్వపు ధర రు 8. ఇప్పటి ధర రు 3-12-0. స్విజర్‌లాండ్ దేశములో లివర్ సామానులతో చేయబడినది. ఒక్క నిమిషమైనను తేడాలేక కాలం సరిగా చూపును. ఇండియా అంతటను అనేక వేలు యీమాదిరి గడియారములు అమ్మియుంటిమి. కాని యింత తక్కువ ధరలకు అమ్మియుండలేదు. చేతియందు ధరించిన బంగారపు ఆభరణమువలె యుండును. రోల్డుగోల్డు కేస్ నెం. 44, రు 3-12-0. 3 సం॥ గ్యారంటీ.

వెస్టరన్ స్విస్‌వాచ్ కంపెనీ, పోస్టుబాక్సు 68, మద్రాసు.

**WESTERN SWISS WATCH CO.,**

**Direct Importers. Post Box No. 68, Madras.**

